క్లుప్తంగా

నేటి విద్యార్థులే రేపటి మూలస్తంభాలు



పెదకాకాని: నేటి విద్యార్థులే భారతావనికి రేపటి మూలస్తంభాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రమైన పెదకాకాని సెయింట్ జోసెఫ్ సీబీఎస్ఈ పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సోమవారం 1000 మంది విద్యార్థినీ విద్యార్థులచే భారతదేశ చిత్రపటం ఆకృతిలో విద్యార్థులందరూ కూడా మానవహారంగా నిలిచి తమ జాతీయతా భావాన్ని ఎలుగెత్తి చాటారు. పాఠశాల ప్రాంగణమంతా వందేమాతరం వందేమాతరం అంటూ విద్యార్థుల నినాదాలతో మిన్నంటి పోయాయి. విద్యార్థులు అందరూ కూడా జాతీయతా భావాన్ని ప్రకటింపజేసే దుస్తులను ధరించి చేతిలో జాతీయ జెండాలను పట్టుకొని పాఠశాల ప్రాంగణమంతా జాతీయ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సంధ్యారాణి విద్యార్థులను ఉద్దేశించి నేటి బాలలే రేపటి పౌరులని, మీరే రేపటి భారతావనికి మూలస్తంభాలని విద్యార్థుల్లో తేజాన్ని కలిగించేలా ప్రసంగించారు. విద్యార్థులు జాతీయ భావంపై ప్రదర్శనలను నిర్వహించారు.

వాలీబాల్ జట్టుకు వేజండ్ల విద్యార్థినులు



వేజండ్ల (చేబ్రోలు): రాష్ట్రస్థాయి బాలికల బాలీబాల్ పోటీలకు చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది బాలికలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు గౌరేశ్వరీదేవి సోమవారం తెలిపారు. ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. గుంటూరు జిల్లా జట్టు తరుపు వేజండ్ల హైస్కూల్‌కు చెందిన మట్టుపల్లి సుమశ్రీ, మట్టుపల్లి జయ సంజన, పఠాన్ షాహెద, బంగినపల్లి మనీషా, బేబీ సునీత, కే నాగమల్లేశ్వరి, యంపరాల నందిని, యంపరాల భవానీ, నాగూర్‌బీ, చందనలు ఎంపికైనట్లు తెలిపారు. హెచ్ఎం గౌరేశ్వరీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, విజయదుర్గ తదితరులు అభినందించారు.

చెస్ పోటీలో పొన్నూరు విద్యార్థికి ద్వితీయ స్థానం

పొన్నూరు: పట్టణంలోని ఆర్‌కె ఇంటర్నేషనల్ స్కూల్ నాలుగో తరగతి విద్యార్థి షేక్. అయాన్ అహ్మద్ గుంటూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు అండర్ 8 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ ఎస్‌కె. నజీర్ ఖాన్, చెస్ కోచ్ బాజీ బాషా విద్యార్థినిని అభినందించారు.

రెడ్డి కమ్యూనిటీ మహిళా అధ్యక్షురాలిగా పద్మలీల



పొన్నూరు: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ పొన్నూరు మహిళా అధ్యక్షురాలిగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు భవనం పద్మలీలావతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీ నిబంధనలను అనుసరించి, రెడ్డి సంఘాల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తానని తెలిపారు. ఐక్యత కోసం పాటుపడుతూ, రెడ్డి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. పద్మలీల నియామకం పట్ల పలువురు ప్రముఖులు, అభినందనలు తెలిపారు.

ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేత



కొరిటిపాడు: యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం క్రెడిట్ ఎక్స్‌పో నిర్వహించారు. బ్యాంకు రీజినల్ హెడ్ ఎస్ఎస్ జవహర్ కార్యక్రమాన్ని ప్రారంభించి, అర్హులైన ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా సకాలంలో సరళమైన వడ్డీ రేట్లతో గృహ, విద్యా రుణాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. స్వదేశీ, విదేశీ విద్యా రుణాల మంజూరులో ముందంజలో ఉంటుందని తెలిపారు. అర్హులైన వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు డెప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థ నాయక్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ జి.వి.రామాంజనేయ కుమార్ పాల్గొన్నారు.

విత్తన విక్రయాల్లో మోసాలు

- నష్టపోతున్న అన్నదాతలు
- నామమాత్రపు తనిఖీలు
- రసీదులు ఇవ్వకుండా విక్రయాలు..
- ఇటీవల విత్తన, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు
- సుమారు రూ. 40 లక్షల విలువైన పురుగు మందులు, విత్తనాలు సీజ్



ఇటీవల తనిఖీల్లో పాల్గొన్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

పొన్నూరు: ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ఎక్కువగా సాగు అవుతున్న వరిసాగులో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మేలు రకం విత్తనాల స్థానంలో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగడుతుండటంతో రైతాంగం నష్టాలను చవి చూస్తున్నారు. మామూళ్లకు అలవాటు పడిన అధికార యంత్రాంగం ఏటా నామమాత్రపు తనిఖీలతో మమ అనిపిస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను విక్రయించి అటు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడంతో పాటు, అన్నదాతలను కష్టాల్లోకి నెట్టేస్తున్నారు. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో నకిలీ విత్తనాల విక్రయం బట్టబయలైంది. పంటల సాగుకు పెట్టుబడులతోపాటు ఇతర ఖర్చులు రైతన్నలకు తలకు మించిన భారంగా మారుతున్నాయి. పంటల్లో సస్యరక్షణకు ఉపయోగించే పురుగు మందులకు రూ. వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. పైర్లకు సోకిన తెగుళ్ల నివారణకు ఉపయోగించే మందులపై అన్నదాతలకు అవగాహన లేకపోవడంతో ఇష్టారీతిన ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి నష్టాలు చవిచూస్తున్నారు. కొందరు వ్యాపారులు రైతులకు విత్తనాలతోపాటు నాసిరకం ఎరువులు, పురుగుమందులు కూడా అంటగడుతున్నారనే విమర్శలున్నాయి. మండలంలోని కొందరు ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణ నిర్వాహకులు ఆదాయమే లక్ష్యంగా మలుచుకుని అనుమతులు లేని విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలస్థాయి వ్యవసాయ అధికారులు దుకాణాల్లో నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. గత నెల 15వ తేదీన జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలోని ఎంఎస్ సాయి కృపాసీడ్స్ పురుగు మందుల దుకాణంలో తనిఖీలు చేసి అమ్మకాల్లో రైతుల సంతకాలు లేని కారణంగా 2466 వేల లీటర్లు, రూ.38 లక్షల విలువైన పురుగుమందులు సీజ్ చేశారు. ఈ నెల 7వ తేదీన పట్టణంలోని ఈనాడు సీడ్స్, శ్రీనివాస ట్రేడర్స్ విత్తనే దుకాణాలలో ఏకకాలంలో తనిఖీలు చేసి ఆంధ్రప్రదేశ్‌లో పేరుగాంచిన కంపెనీ పేరుతో తెలంగాణ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండాసరఫరా చేసుకున్న రూ. 1 లక్ష 94 వేలు విలువైన వరి విత్తనాలను గుర్తించి నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేశారు.

రైతులు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి

ఎరువుల వ్యాపారులు అందరికీ కనిపించేలా ధరల పట్టిక ఏర్పాటు వేయాలి. రైతులు సరైన సీలువేసి ధ్రువీకరణ పత్రాలు ఉన్న ఎరువులు, విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. విత్తనాల రకాలు, గడువు తేదీ, నంబరు చెక్ చేసుకోవాలి. విత్తనాలు వినియోగించాక ఖాళీ సంచులు, ప్యాకెట్లు జాగ్రత్తగా దాచుకోవాలి. నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు యూరియా కొరత సృష్టిస్తే సమాచారం ఇవ్వాలి.

–ఆర్. వెంకటేశ్వరరావు, ఏవో, పొన్నూరు

ఏ 'దారీ' లేక.. కార్యాలయం ఎదుట బైఠాయింపు



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన యనమదల గ్రామస్తులు

ప్రత్తిపాడు: ఇళ్లకు వెళ్లే దారిని ఆక్రమించుకుంటున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నెలల తరబడి ఏ అధికారి నుంచి కూడా స్పందన లేకపోవడంతో ఏమి చేయాలో తెలియక, ఏ 'దారీ' లేక కార్యాలయం ముందు బైఠాయించి తమ ఆవేదనను వెళ్లగక్కారు యనమదల గ్రామస్తులు. వివరాల్లోనికి వెళితే గుంటూరు జిల్లా యనమదల గ్రామానికి చెందిన సుమారు పన్నెండు గృహాలకు చెందిన వారు తమ ఇళ్లకు వెళ్లే దారిని ఆక్రమించుకుని అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారంటూ గతంలో యనమదలకు చెందిన మహిళలు గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించకుండానే అధికారులు ఫిర్యాదును ముగించేశారు. దీంతో గత సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఇదే సమస్యపై తహసీల్దార్ సుజాతను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇంతలో భవన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏమి చేయాలో అర్థం కాక సోమవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరు మహిళలు ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. న్యాయం చేయాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. తహసీల్దార్ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో వారు మహిళలకు నచ్చజెప్పి శాంతింపజేశారు. అనంతరం తహసీల్దార్ సుజాత స్పందించి మంగళవారం వచ్చి స్థలాన్ని చూసి, సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో సమస్య ఆందోళన విరమించారు.

మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి



సైకియాట్రిస్ట్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రత్తిపాడు: విద్యార్థినులు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్రీరమ్య అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా కళాశాలలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సైకియాట్రిస్ట్ శ్రీరమ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థినులు అనూహ్యంగా తలెత్తే ప్రమాదాలు, ఇబ్బందుల నుండి తమను తాము రక్షించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న అరాచకాలను తెలివిగా ఎదుర్కొంటూ తమ తమ విద్యలలో రాణించాలని చెప్పారు. రీచ్ హైట్స్ సీఈవో డి. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ సమయం చాలా విలువైనదన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థినులు తరగతి అంశాలతో పాటుగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ పట్ల కూడా పట్టు సాధించాలన్నారు. అప్పుడే ఉద్యోగాలు సాధించగలమన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిషోర్ బాబు, డైరెక్టర్ డా. కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, ఎస్ఎండ్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణ చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళలను అంకితభావంతో సాధన చేయాలి



సర్టిఫికెట్స్ అందజేస్తున్న డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

పెదకాకాని (ఏఎన్‌యూ): కళల పట్ల అంకితభావంతో సాధన చేసి పేరు ప్రఖ్యాతులు పొందాలని డాక్టర్ రమణారావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ పర్ఫామెన్స్, ఫైనార్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్స్ ఆధ్వర్యంలో గత ఎనిమిది రోజులుగా జరుగుతున్న శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్యంగా కేరళ రాష్ట్ర కలరి పట్టు మీద ఉదయ్ కుమార్, తమిళనాడుకు చెందిన డాక్టర్ రూప శీలమ్ బాటమ్, కుంగ్ ఫూ ఫణీంద్రకుమార్ ఆయా ప్రక్రియలకు సంబంధించి వివిధ రకాలైన అంశాలను రంగస్థల విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడం జరిగింది. గత ఎనిమిది రోజుల నుంచి దాదాపు 25 మంది కళాకారులు ఈ అంశాల మీద శిక్షణ పొంది వారి యొక్క నటనను మెరుగులు దిద్దుకునేందుకు శిక్షణ పొందారు. ముఖ్యంగా ఆచార్య నాగార్జున డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విద్యార్థి కళాకారులకు వారి పాఠ్యాంశాలలో భాగంగా వివిధ నైపుణ్యాలు, అంశాల మీద శిక్షణ ఇవ్వడం అనే దానిమీద పూర్తి దృష్టిని పెట్టడం జరిగింది. ఈ శిక్షణ శిబిరం నిర్వహణ నిమిత్తం వేదిక రంగస్థల సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు వారి సహాయ సహకారాలు అందిస్తూ రంగస్థలంకు సంబంధించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రోత్సాహాన్ని అందించారు. రంగస్థల కళల శాఖ అధిపతి ఆచార్య నాగభూషణరావు మాట్లాడుతూ నటులు వివిధ ప్రక్రియలు అలవాటు చేసుకొని ఆచరిస్తూ శారీరక ఆరోగ్యాన్ని కూడా పొందవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన తెలుగు నాటక రంగంలో నైపుణ్యం గల వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఇలాంటి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకుని నేటి తరం నటులు మరింత ఉన్నతి చెందాలన్నారు. ఈరోజు జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో బ్రూనే దేశస్థుడు మన తెలుగువారు డాక్టర్ రమణరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థి కళాకారులను ప్రోత్సహిస్తూ రానున్న కాలంలో కళాకారుల యొక్క ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. దేశ విదేశాల్లో కూడా మన కళలకు మంచి గుర్తింపు ఉందన్నారు. అంకితభావంతో సాధన చేసి దేశ విదేశాల్లో సైతం పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

అధునాతన సాంకేతికతతోనే విద్యార్థులకు భవిష్యత్



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఇంజనీర్లేనని, విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా నైపుణ్యతలు మెరుగుపరుచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతపై పట్టు సాధిస్తే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత డిజిటల్ టెక్నాలజీపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, అందుకే ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్నాయని తెలిపారు. విద్యార్థులు వినూతన పరిశోధనలవైపు దృష్టి సారించాలన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి తమ కళాశాలను ఎంచుకున్న ప్రతి విద్యార్థికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో పోటీ పడేలా జ్ఞానాన్ని సంపాదించుకుని పోటీ ప్రపంచంకు అనుగుణంగా పరిశోధనలవైపు దృష్టిసారించాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు కృషిచేయాలన్నారు. విజ్ఞాన్ యూనివర్శిటీ డీన్ ఏ శారద మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ సాయిరెడ్డి, కిరణ్‌కుమార్, మదన్‌హారతిలు విద్యార్థులు సైబర్ సొల్యూషన్స్, కోడ్ చెఫ్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కళాశాల నాక్ ఏ గ్రేడ్, ఎన్‌బీఏ అటానమస్ కలిగి ఉందన్నారు. కళాశాలలో విద్యార్థులకు అందించే సౌకర్యాలను వివరించారు. అనంతరం అతిదులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ బాలాజీ, డాక్టర్ వెంకటరామారావు, పీవీ నరేంద్రకుమార్, జె.భార్గవ్, నాగగోపి, అరుణ, ఎ.రాధాకృష్ణమూర్తి, డి వినయ్‌కుమార్, తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి



పొన్నూరు: వివిధ సమస్యలపై మండల పరిధిలోని ప్రజల నుంచి తీసుకుంటున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుంచి 7 అర్జీలను తీసుకున్నారు. వాటిలో రెవెన్యూ 5, సర్వే 1, ఆర్ అండ్ బి 1, విద్యుత్ శాఖకు సంబంధించి స్వీకరించిన 1 అర్జీని వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు,, ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు, డీటీ మాధవి, ఆర్ఐ రామారావు, అధికారులు పాల్గొన్నారు.

– నీటి వనరుల గణనపై శిక్షణ

గ్రామాల్లోని బావులు, చెరువులు, బోరు బావులపై సర్వే చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. కార్యాలయంలో 7వ చిన్న తరహా నీటి వనరుల గణనపై శిక్షణ నిర్వహించారు. సర్వేలో బోర్లు, బావులు ఉన్న రైతులను గుర్తించి నీటి వనరుల వివరాలు సేకరించాలన్నారు. సహాయ గణాంక అధికారి ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మీరే రాకపోతే ఎలా?



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కు అధికారులు డుమ్మా కొట్టేశారు. పీజీఆర్ఎస్‌కు ఆయా శాఖల అధికారులు గైర్హాజరవ్వడంతో ఇదిగో ఇలా ఖాళీ కుర్చీలతో వెలవెలబోయింది. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయిలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌పై అధికారులు ఇలా అలసత్వం వహిస్తుండటం విమర్శలకు దారితీస్తుంది.

ఉద్యోగాలు పొందిన యువతకు సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో రిఫరెన్స్ పుస్తకాలను చదువుకుని ఇటీవల ప్రకటించిన పోలీసు కానిస్టేబుల్, ఆర్ఆర్‌బీ టెక్నికల్ ఉద్యోగాలు సాధించిన యువతకు సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి వెన్నెటి సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రాంతీయ గ్రంథాలయంలో చదువుకున్న వారిలో తొమ్మిది మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఆరుగురు అభ్యర్థులను సత్కరించారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సీఐటీయూ నాయకుడు కె.ఆదినారాయణ



తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందిస్తున్న ఆటోకార్మికులు

ప్రత్తిపాడు: ఆటోకార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు కె. ఆదినారాయణ అన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నియోకవవర్గ కేంద్రం ప్రత్తిపాడులో ఆటో డ్రైవర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ జి.సుజాతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని ప్రకటించిందని, అదే జరిగితే ఆటోవాలాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు లేక అనేక మంది నిరుద్యోగ యువత లాభసాటిగా లేని వ్యవసాయం చేయలేక ప్రైవేట్ ఫైనాన్షియర్ల వద్ద అప్పులు చేసి నెల నెల కిస్తీలు చెల్లిస్తే పిల్లలను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో బాడుగలు తగ్గిపోతాయని, అందుచేత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్న ప్రతి ఆటోవాలాలకు వాహనమిత్ర పథకం ద్వారా పాతిక వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాలలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, జీవో నెంబర్ 21 రద్దు చేయాలని అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలని లేనిపక్షంలో దశల వారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల కన్వీనర్ కె. కుమార్, యూనియన్ సభ్యులు మాణిక్యరావు, యాకోబు, యెహోషువ, శ్రీకాంత్, సిహెచ్. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగ జీవితంలో విజయసాధన



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవడం ద్వారానే ఉద్యోగ జీవితంలో విజయాన్ని సాధించగలరని ప్రముఖ ప్రేరణాత్మక ఉపన్యాసకుడు శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కనిష్ఠ స్థాయిలో అవసరమైన నైపుణ్యాలను ప్రేరణాత్మకంగానే కాకుండా వ్యవహారికంగా వివరించారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, విశ్లేషణాత్మక దృష్టికోణం, రీజనింగ్, సమస్య పరిష్కారం, నాయకత్వం, బృందపని, వృత్తిపరమైన నైతికత, తెలివైన నిర్వహణ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లో విజయ సాధనకు నైపుణ్యాలతో నిరంతరం సాధన చేస్తే భవిష్యత్తులో కెరీర్ నిర్మాణానికి మూల స్థంభాలని పేర్కొన్నారు. కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత మాట్లాడుతూ విద్యారంగంలో నాణ్యతను పెంచేందుకు కార్యకలాపాలైన స్ఫూర్తి పారిశ్రామిక ప్రదర్శన, విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు స్పర్థ మేనేజ్‌మెంట్ ఫెస్ట్, సృజనాత్మక నైపుణ్యాలను పెంచేందుకు ఉద్దేశించిన సృజన గురించి వివరించారు. నాలుగురోజుల పాటు నిర్వహించనున్న ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో కొత్తగా ప్రవేశించిన విద్యార్థులకు కోర్సు లక్ష్యం, మౌలిక సిద్ధాంతాలు, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ ఎంబీఏ అనేది ఒక ప్రతిష్టాత్మకమైన డిగ్రీ అని, ఇది విజయవంతమైన కెరీర్‌కు మార్గం చూపిస్తుందని పేర్కొన్నారు. పట్టుదల, సమయపాలన, నిరంతర అభ్యాసం, తరగతులకు సక్రమంగా హాజరు కావడం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు షేక్ షబానా పర్వీన్, వేదవతి, అనిత, రాజేశ్వరి, వెంకట కళ్యాణ్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఐరా హార్ట్ అండ్ పాలిక్లినిక్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ ఎం.ఎ.సమీనా ఫర్వీన్ తెలిపారు. స్థానిక ఆనందపేటలో హాస్పిటల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. అవసరమైన వారికి గుండె పరీక్షలు కూడా చేస్తామన్నారు. పోలీసులు, మిలటరీ సిబ్బందికి ప్రతిరోజూ ఉచిత ఓపీ సేవలందిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ అతీఫ్ కోరారు.

'ప్రకృతి' కరివేపాకు ఆరోగ్యానికి మేలు

జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.రాజకుమారి



కరివేపాకును మోపులు కడుతున్న కూలీలు పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు

చేబ్రోలు: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిన పంటలు రసాయన రహితంగా ఉండటం వల్ల ఆరోగ్యానికి కలిగే మేలు కలుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.రాజకుమారి అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో కరివేపాకు సాగు చేసిన పి.నాగభూషణం పొలంను సోమవారం డీపీఎం రాజకుమారి పరిశీలించారు. వేజండ్ల గ్రామానికి చెందిన రైతు సాగు చేస్తున్న కరివేపాకుకు ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తుండటం వల్ల ఇటువంటి కరివేపాకు కు మార్కెట్లో సాధారణ ధర కంటే 10% అధిక ధర లభించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ సహకారంతో ''అన్యథా'' అనే ప్రైవేట్ కంపెనీతో అధికారికంగా ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, కంపెనీ ప్రతి నెలకు 20 టన్నులు వారానికి సుమారు 5 టన్నులు చొప్పున కరివేపాకును రైతు నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నదన్నారు. ఈ రోజు మొదటి సారిగా సరఫరా ప్రారంభమైనట్లు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఎం కె. రాజకుమారితో పాటు అన్యథా కంపెనీ ప్రతినిధి సాయికేష్, ఎస్ఎఫ్ఏ సుమ తదితరులు పాల్గొన్నారు.

శంకరంబాడి సుందరాచారికి ఘన నివాళి

లక్ష్మీపురం: మా తెలుగు తల్లికి మల్లెపూ దండ పాటతో తెలుగు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచి పోయిన శంకరంబాడి సుందరాచారి రచనలను పాఠకులకు అందుబాటులో తేవల్సిన అవసరం ఎంతైనా ఉందని రచయిత్రి, ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్ పింగళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం మనమూ పాడుదాం రండి బృంద సభ్యుల ఆధ్వర్యంలో శంకరంబాడి సుందరాచారి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 1975లో హైదరాబాద్‌లో జరిగిన ప్రప్రథమ తెలుగు మహా సభలలో తెలుగు తల్లికి మల్లె పూ దండ పాటను రాష్ట్ర గీతంగా ఎంపిక చేసి అధికార కార్యక్రమాలలో సభకు ముందు ఈ గీతాన్ని ఆలాపించాలని ప్రభుత్వం ఆదేశించిందని గుర్తు చేశారు. న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తన చరనా వ్యాసంగం, సాహితీ సేవను సుందరాచారి విడనాడలేదన్నారు. అనంతరం సంస్థ సభ్యులు నివాళులర్పించారు.

న్యాయరంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన

నెహ్రూనగర్: న్యాయరంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకుని ముందుకు సాగాలని ప్రముఖ క్రిమినల్ చట్టాల నిపుణులు డాక్టర్ గంట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని జేకేసీ కాలేజీ రోడ్డులోని ధర్మపీఠం సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ రంగంలో ఉన్న విస్తృత ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సతీష్ కుమార్ మాట్లాడుతూ ఒక్క న్యాయవాది వృత్తిలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా 60కి పైబడి ఉన్నటువంటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెబీ, ఇన్సూరెన్స్ వంటి రెగ్యులేటరీ బాడీలలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇవన్నీ కూడా ప్రతి నిపుణునికి లక్షల్లో జీతాలు చెల్లిస్తున్నాయని వివరించారు. అనంతరం ధర్మపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ వృత్తి, ఉద్యోగాలపరంగా వందలాది చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మపీఠం ఉపాధ్యక్షురాలు తాళ్లూరి ప్రహర్షిత, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి శ్రీనివాసరావు, శెట్టిపల్లి శశికిరణ్, సంపతి సంతోష్ కుమార్, కొంగర దినకర్, చామర్తి సంతోష్ కుమార్, పిట్టల వెంకట్రావు, పుల్లారావు పాల్గొన్నారు.